# వారసత్వం

సిటీలో ఊర్మిళాదేవి పేరున్న గైనికాలజిస్ట్!

చాలా ఏళ్ళు విదేశాల్లో ఉండి నేరుగా వైజాగ్ వచ్చి సెటిలైందని చెప్పుకుంటారంతా.

వైజాగ్‌లో మకాం పెట్టగానే ప్రైవేట్ ప్రాక్టీసు ప్రారంభించింది.

రెండు నెలలైనా తిరక్కముందే రిటైర్డు జడ్జి గంగాధరం గారి బంగళా పక్కనే ఉన్న ఖాళీస్థలం కొనేసింది.

సంవత్సరం నిండక ముందే రెండు మూడులక్షలు ఖరీదు చేసే ఖరీదైన మెటర్నిటీ నర్సింగ్ హోమ్ కట్టించింది.

యూరిన్ ఎగ్జామినేషన్ దగ్గర్నుంచీ సిజేరియన్ ఆపరేషన్ దాకా అన్ని వసరులు, సదుపాయాలూ నర్సింగ్ హోంలో ఉన్నాయ్. మరో ముగ్గురు డాక్టర్లు... ఓ డజనుమంది నర్సులు...తోటీలు ఆయాలు...వగైరా వగైరాలు వున్నారు.

ఊర్మిళాదేవి నర్సింగ్‌హోం ముందు గవర్నమెంటు హాస్పిటల్ బలాదూర్ అనిపిస్తుంది.

ఊర్మిళాదేవికి ధనాశ లేదనే పేరుంది సిటీలో, హస్తవాసి మంచిదనీ చెప్పుకుంటారు.

ఆమె ప్రాక్టీసు విపరీతంగా పెరిగేటందుకు ముఖ్య కారణాలు అవే.

బీదవాళ్ళనుకుంటే ఉచితంగానే పురుడు పోస్తుంది. ఇవ్వగల వాళ్ళా అన్పిస్తే, వందలు గుంజుతుంది.

ఊర్మిళాదేవి వయస్సెంతో అంచనా వెయ్యటం కష్టం! నలభై వున్న మనిషిలా కన్పిస్తున్నా...కళగల ముఖం... పసిమిఛాయ ... అర్ధరూపాయంత సైజులో ఎర్రనిబొట్టు... ఫారిన్ బన్ను... నిత్యమూ వంటినుండే కంచిపట్టు చీరె... ఖరీదైన కళ్ళజోడు...ఆమెను చూడగానే ఎవరికైనా గౌరవ భావం కలుగక తప్పదు. మంచి మాటకారి!

వివాహమైందో లేదో తెలీదుగానీ...ముందూ వెనుకా బాదరబందీ వున్నట్టు కన్పించదు.

లంకంత బంగళాలో ఆమె ఒక్కతే వుండటం చాలా మందికి తెలుసు.

అర్ధరాత్రీ అపరాత్రీ అనకుండా... అక్కడికొచ్చే పేషంట్ల సేవచేయటమే ఆమె దైనందిన చర్యగా కన్పిస్తుంది.

రిటైర్డుజడ్జి గంగాధరంగారి ఫామిలీతో తప్పించి ఊర్మిళా దేవికి సిటిలో ఎవరితోనూ అంత సన్నిహిత సంబంధం లేదనే చెప్పాలి!

గంగాధరంగారి కడగొట్టు పిల్ల రాధంటే ఊర్మిళా దేవికి పంచప్రాణాలు!

రాధ ఎమ్మెస్సీ చదువుతోంది. చురుకైనపిల్ల.

"ఆన్టీ... ఆన్టీ" అంటూ ఊర్మిళాదేవి చుట్టు తిరుగుతుంది.

ప్రతిరోజూ ఏదో టైంలో రాధ వచ్చి తనను పలకరించి పోకపోతే ఊర్మిళా దేవికి తోచదు.

వేడి వేడి టీ ఆఫర్ చేసి కాస్సేపు రాధతో ముచ్చట్లు చెప్పి పంపేయటం అలవాటు.

సాయంత్రం ఆరుకొట్టేసరికి ఛంగు ఛంగున లేడిలా గెంతుతూ వచ్చే రాధ... రెండు రోజులుగా కంటికి అవుపించక పోయేసరికి ఊర్మిళా దేవికి ప్రాణం విలవిల్లాడిపోయింది.

అడుగులో అడుగేసుకుంటూ పరధ్యానంగా మూడో రోజు తనింట్లోకొస్తున్న రాధ అవుపించగానే ఊర్మిళా దేవిలో కలవరం బయల్దేరింది.

"ఏం రాధా?... నన్ను మర్చిపోయావా?" — అంది ఊర్మిళా దేవి.

ఇంతలో వంటమనిషి రెండు కప్పులలో టీ తెచ్చి ఇద్దరికీ ఇచ్చింది.

టీ సిప్ చేస్తూ మౌనంగా వుండిపోయింది రాధ.

రాధ ముఖంలోకి నిశితంగా చూస్తూ ఆమె నిర్లిప్తతకు కారణం ఏమైవుంటుందా అని ఆలోచిస్తూ టీ తాగటం పూర్తి చేసింది ఊర్మిళ.

మరో రెండు మూడు నిముషాలు గడిచినా రాధ మాట్లాడక పోవడం గమనించి "రాధా! అట్లా దిగులుగా వున్నావేం? డాడీ ఏమైనా అన్నాడా... లేకవంట్లో బాగా లేదా?" పరామర్శగా అడిగింది ఊర్మిళ.

"అలాటిదేం లేదు ఆన్టీ!... నీతో ఒక విషయం మాట్లాడాలి..." ఎటోచూస్తూ చెప్పింది.

"కాన్ఫిడెన్షియలా? – చెప్పు పర్వాలేదు.. ఇక్కడెవరూ లేరుగా...

" ఆన్టీ!... నాకో హెల్పుచేసి పెట్టాలి ... "

రాధ అడగబోయే విషయమేమై వుంటుందాని ఓ క్షణం ఆలోచించింది.

"నే చెప్పే విషయాన్ని చాలా సీక్రెట్ గా వుంచాలి ఆన్టీ ..."

ఆమాట విన్నాక ఊర్మిళాదేవిలో కంగారు చోటు చేసుకుంది.

"కంగారుపడకు ఆన్టీ! — నేను చెప్పబోయేది నాగురించి కాదు ..."

"హమ్మయ్య" అనేసి గట్టిగా ఊపిరిపీల్చింది ఊర్మిళ.

"ఊఁ! ఇప్పుడు చెప్పు!! — విషయం ఎలాంటిదైనా ఫర్వాలేదు ..." ముందుకు వంగి కుర్చీలో కూర్చున్న ఊర్మిళ కుడిచేయి చెంపకి ఆన్చుకుంటూ అంది.

"నా క్లాస్‌మేట్ మనోరమ చాలా మంచి అమ్మాయి! నాకున్న ఒక్కగానొక్క స్నేహితురాలు మనోరమే! హాస్టల్లో వుంటోంది ..." శూన్యంలోకిచూస్తూ చెప్తున్నదల్లా ఊర్మిళా దేవి వైపు దృష్టి మరల్చింది రాధ.

"చెప్పు రాధా ఆగావేం? —"

"బాయ్ ఫ్రెండ్ కల్లబొల్లి మాటలు నమ్మి మోస పోయింది మనోరమ — నెల తప్పింది! మనిషి కంగారుపడు తోంది... వాళ్ళ డాడీ హైదరాబాద్‌లో వున్నాడు. ఈ రహస్యం నాకు తప్పించి మరెవ్వరికీ తెలీదు. నాతో విషయం చెప్పుకుని ఏడ్చింది..." చెప్పలేక చెప్పలేక విషయాన్ని క్లుప్తంగా చెప్పింది రాధ.

ఇలాంటి వార్త తనకేమీ కొత్తకాదన్నట్టు రాధ ముఖంలోకి చూచింది ఊర్మిళ. డాక్టరుగా ఇలాంటి కేసులెన్నో చూచింది విదేశాల్లోకూడా!

"ఆత్మహత్య చేసుకుంటానని ఏడుస్తోంది మనోరమ! ఎలాగో నేను ధైర్యం చెప్పేను. గుండె రాయి చేసుకోమ న్నాను. తొందరపడొద్దని హెచ్చరించాను..."

"ఉద్రేకంలో అవివేకంతో కాలుజారటం రైటో తప్పో చెప్పలేను గానీ... ఈ పరిస్థితుల్లో ఆత్మహత్య చేసుకోవాలనుకోవటం నేరమే కాదు. అమానుషం!—" నిశ్చలంగా అంది ఊర్మిళ.

"తప్పొప్పులు గురించి కాదు ఆన్టీ నా ఆలోచన... ఆమె చచ్చిపోవటం నాకిష్టంలేదు. అలా జరక్కుండా వుండాలి ఆంటీ...నీ హెల్పు ఎంతో అవసరం..." జాలిగా అడిగింది. అడగటంకాదు రాధ మాటల్లో అర్థింపు ధ్వనించింది.

ఆమాట విన్న ఊర్మిళ క్షణంపాటు బిగుసుకుపోయింది.

"మాట్లాడవేం ఆంటీ..." రెండు చేతులూ పట్టుకుని కుదుపుతూ అంది రాధ.

"ఏం మాట్లాడను?- మెడికల్ ఎథిక్సు ప్రకారం ఎబార్షన్ చేయటం ఘోరమైన నేరం..." నిర్లిప్తంగా అంది.

"ఆన్టీ నువ్వీ సాయం చెయ్యకపోతే... అవమానం భరించలేక నా ఫ్రెండు చచ్చిపోతుంది. ఆంటీ! ఒకఫూల్ చేసిన అన్యాయానికి ఆమె చచ్చిపోవటం నేను సహించలేను. నమ్మింది మోసపోయింది... అంతే! మనోరమ చాలా అమాయకురాలు. యూనివర్సిటీలో మనోరమ బ్రిలియంట్ స్టూడెంటని మంచి పేరుంది కూడా. ఆమె మంచినీ...అమాయకత్వాన్నీ ఒక ఇడియట్ ఎక్స్ప్లాయిట్ చేసి వంచించాడు. ఆంటీ! ఎలాగైనా సరే ఈఆపద నుంచి నా ఫ్రెండును నువ్వే రక్షించాలి... తప్పదు" జాలిగా అడిగింది రాధ.

నిట్టూర్చి ఓ క్షణం ఆలోచించి "ఆల్ రైట్! నువ్వు నీ ఫ్రెండును రేపు మన నర్సింగ్ హోంకి తీసుకురా. మిగతా విషయాలు నేను మాట్లాడుతాను. సరేనా!?!..." బరువుగా జవాబిచ్చింది ఊర్మిళ.

రాధ ముఖంలో సంతోషం పురివిప్పింది ఊర్మిళాదేవి సమాధానంతో.

"ప్రామిస్..."

"బిలీవ్ మి డియర్..." భుజంతడుతూ అంది ఊర్మిళ.

రాధ గుండెల మీద బరువు ఊర్మిళాదేవి దించినట్టే ఫీలైంది

గుడ్ నైట్ చెప్పి వెళ్ళిపోయింది రాధ.

రాధ విషయం చెప్పి వెళ్ళిపోయిన క్షణం నుంచీ... ఊర్మిళాదేవి ఆలోచనలో మార్పేదో వచ్చినట్టు ఆమె ముఖ కవళికలద్వారా వ్యక్తమవుతోంది.

ఏదో వెలితి... బాధ—మనిషిలో తొంగి చూస్తోంది.

ఎడతెరిపి లేని ఆలోచన్లు ఊర్మిళాదేవిని ఇరవై సంవత్సరాల వెనక్కు బలంగా ఈడ్చుకెళ్ళాయి.

ఇన్నాళ్ళు ఆ విషయాన్నే మర్చిపోయి గుండె రాయి చేసుకుంది.

కానీ...మళ్ళీ ఇన్నాళ్ళకు...ఇప్పుడు గుర్తొచ్చింది.

ఇరవై సంవత్సరాలనాటి సంగతి కళ్ళముందు సినీరీలులా గిరగిరా తిరిగింది.

తాను మెడిసన్ చదువుతున్న రోజులు...

యం. డి. లో చేరింది.

పోస్టు గ్రాడ్యుయేషన్లో చాలా మంది బ్రిలియంట్ స్టూడెంట్సు సైతం తప్పుతూంటారనే నిజం తెల్సుకుని కలవర పడ్డది ఊర్మిళ.

ఏలాగైనా రాత్రింబవళ్ళు కష్టపడి యం. డి. ఫస్ట్ ఛాన్సులో నెగ్గుకు రావాలనే తాపత్రయం... ఆరాటం ... అంతకు మించిన శ్రద్ధా ఊర్మిళలో ప్రబలుతూ వచ్చింది.

తన ప్రొఫెసర్ రావ్ చాలా మంచి వ్యక్తి! తనంటే ఎంతో అభిమానం!!

మరో రెండేళ్ళలో రిటైర్ కాబోతున్న ప్రొఫెసర్ రావ్ గుండెలో గూడు కట్టుకుని...మనసులో బలీయంగా పీఠం వేసు కున్న కోర్కె వంటరిగా వున్న సమయంలో తనతో వెలిబుచ్చి నప్పుడు...ఆ మాటకి ప్రాణ్ణపడ్డది ఊర్మిళ.

వయస్సుపరంగా వృద్ధాప్యం సమీపిస్తున్న తండ్రిలాంటి ప్రొఫెసర్లో అలాంటి నీచమైన కోర్కె తలఎత్తినందుకు నిర్ఘాంత పోయింది ఊర్మిళ.

తనమీద వున్న అలాంటి అభిప్రాయాన్ని దూరం చేసు కోమని ప్రొఫెసర్ని వేడుకుంది. అర్థించింది. కాళ్ళావేళ్ళా పడి బ్రతిమాలింది ఊర్మిళ.

ససేమిరా తన ఆలోచనా, నిర్ణయం మార్చుకోని ప్రొఫెసర్ రావ్ మనస్తత్వానికి నిర్విణ్ణురాలైంది.

యం. డి. కావాలంటే తప్పదని బెదిరించాడు. చివరకు లొంగదీసుకున్నాడు— కాదంటే పడుతున్న శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరే అవుతుందనిపించింది ఊర్మిళకు.

ప్రొఫెసర్ కోరికల అడకత్తెరలో పోకచెక్కలా నలిగి పోయింది ఊర్మిళ.

అందుకు ప్రతిఫలంగా నెలతప్పటం జరిగింది.

ఆ నిజం తెల్సుకున్న క్షణాన ఊర్మిళ ప్రాణం విలవిల్లాడి పోయింది.

తల్లి కావటమా? — కన్యగానే... భయంకరమైన ఆలోచన్లు భయపెట్టసాగాయి.

ప్రొఫెసర్ నిర్ణయం ప్రకారం తల్లి కాబోయేటందుకే నిర్ణయించుకుంది- ఎవ్వరికి తెలీకుండా మెడలో పసుపుతాడు కట్టుకుంది. తలవని తలంపుగా పెళ్ళి జరిగిందనేసి ఫ్రెండ్సుతో బొంకింది.

నవమాసాలు మోసికన్న పసికందును ప్రొఫెసర్ చేతుల్లో పెట్టింది. కానీ... తన బాధ్యత తీరినట్టుమాత్రం ఫీల్ కాలేదు.

ప్రొఫెసర్‌కికూడా భార్య లేదు. సంతానం లేదు.

తను ఏకాకి కాకూడదనే నిర్ణయానికొచ్చి పాప సంరక్షణ భారం తానే వహిస్తానని ప్రామిస్ చేశాడు ప్రొఫెసర్.

తనకున్న డబ్బుతో పలుకుబడితో ఊర్మిళను ఫారిన్ పంపేయాలనుకుని నిశ్చయించుకున్నాడు ప్రొఫెసర్.

ప్రొఫెసర్ ఆలోచనకూడా సమంజసంగానే తోచింది. పై చదువుల కోసం... అనుభవం సంపాదించుకోవటం కోసం విదేశాలు వెళ్లేందుకు వప్పుకుంది ఊర్మిళ.

పాపకి ఏడాదైనా నిండలేదు.

సెండాఫ్ ఇచ్చేందుకు పాపతో ఎయిరోడ్రోమ్ కొచ్చాడు ప్రొఫెసర్.

ప్రొఫెసర్ చేతుల్లో వున్న పాప అమాయకంగా బోసిగా నవ్వుతోంది. కేరింతలు కొడుతోంది.

ఊర్మిళలో దుఃఖం పెల్లుబికింది.

దగ్గరగావచ్చి చివరిసారిగా బాహువుల్లోకి తీసుకుని హృదయానికి హత్తుకుని ముద్దాడింది.

పాపను వదల్లేక వదల్లేక ప్లెయినెక్కింది.

"అమ్మగారూ,.. భోజనానికి లేవండి పొద్దుపోయింది..." వంటమనిషి పిలుపుకి వులిక్కిపడి గతంలోంచి ప్రస్తుతంలో కొచ్చింది డాక్టర్ ఊర్మిళాదేవి.

మనసంతా వెలితితో నిండిపోయినట్టనిపించింది. అశ్రుపూరితనయనాలు చీరకొంగుతో తుడుచుకుంది.

"ఎందుకమ్మా... అలా వున్నారూ!" వంటమనిషి అడిగింది.

"ఏం లేదు. ఉదయం మననర్సింగ్ హోంలో చచ్చిపోయిన పేషెంటు గుర్తొచ్చింది... అంతే..." అనేసి అబద్ధం చెప్పి తప్పించుకోక తప్పలేదు.

ఇప్పుడు పాపబాగా ఎదిగి పెద్దదై వుంటుంది. ఎక్కడుందో? — ఎలావుందో? — ఏంచేస్తోందో? — ఎదురుపడితే తాను గుర్తుపట్టి పోల్చుకోలేదు...

ఇంకా ఎక్కడిపాప... ఎక్కడితను?

ప్రొఫెసర్ రావ్ ఎలా వున్నాడో? - బాగా పెద్దవాడై వుండాలి!- అసలు బ్రతికివున్నాడో లేదో?

కొన్నేళ్ళుగా తనకూ ప్రొఫెసర్ కూ మధ్య వుత్తరాలే లేవు- బహుశ... ప్రొఫెసర్ కాలంచేసి వుంటాడు. లేకపోతే తనవుత్తరాలకు కనీసం ఒక్క సమాధానమైనా రాకుండా వుంటుందా?

"అమ్మగారూ... భోజనానికి లేవరూ" మళ్ళీ బ్రతిమలాడింది వంటమనిషి.

"నాకు ఆకలిగాలేదు... నువ్వాతినెయ్... నాకో గ్లాసు పాలు పట్టుకురా చాలు!! ..." అనేసి వెళ్ళిపోయి బెడ్ రూములో పక్కమీద వాలిపోయింది ఊర్మిళాదేవి.

* * *

"అమ్మా? మీకోసం ఎవరో వచ్చారు..." స్ప్రింగ్ డోర్ తెరుచుకుని కన్సల్టింగ్ రూములోకొచ్చి చెప్పేడుబోయ్.

"డెలివరీ కేసా ?—" అడిగింది పక్కకు తిరిగిచూస్తూ.

"కాదండీ...ఎవరో మగాయన..." చెప్పేడు బోయ్.

ఊర్మిళ నోటినుండి సమాధానం వచ్చే లోపుగానే సుమారు డెభ్భైయ్యేళ్ళ వ్యక్తి స్ప్రింగ్‌డోర్ తెరుచుకుని లోపలికొచ్చాడు.

బోయ్ బైటకి వెళ్ళిపోయాడు.

ఆ వచ్చిన వృద్ధుడికేసి నిర్ఘాంతపోయి అలాగే చూస్తూ వుండిపోయింది ఊర్మిళాదేవి—ఆమె చేతివేళ్ళ మధ్య వ్రేలాడు తున్న తడి ఆరని ఎక్సరే ఫిలిం అచేతనంగా జారి నేలమీద పడ్డది.

వంగిన నడుము...మడతలుపడ్డ ముఖం...ముగ్గుబుట్టలా నెరిసినతల...చప్పిదవడలు...కళ్ళకుజోడు...చేతిలో స్టిక్కు... వయస్సు మించిపోయి... వార్ధక్యంలో వున్న......ఆ వచ్చిన వ్యక్తి ప్రొఫెసరే అని నిర్ధారించుకుంది ఊర్మిళాదేవి.

అవును! రావుగారే!! ప్రొఫెసర్ రావుగారే...అయితే దేవుడి దయవల్ల క్షేమంగానే వున్నారన్నమాట... అబ్బ! మనిషిలో ఎంత మార్పు? తిరిగి ఎన్నాళ్ళకు...కాదు... ఎన్నే ళ్ళకు చూడగలిగింది తను ?—

"సార్ ! బావున్నారా ?—" దగ్గరగా వచ్చి ఆప్యా యంగా పలుకరించింది.

"నన్ను మీరు ఎరుగుదురా?— నాకు దృష్టి బాగా మందగించింది...వృద్ధాప్యం కదా?..." వణికే స్వరంతో తీవిగా అన్నాడు.

"నేను సార్ ఊర్మిళను!! మీ ఊర్మిళను!! ఖులాసాగా వున్నారా?... బాగా పెద్దవారైనారు — పాప బాగుందా సార్?— ఎక్కడుంది?— ఎలా వుంది..." గడగడా మాట్లాడుతూ ప్రశ్నల వర్షం కురిపించింది ఊర్మిళా దేవి.

ఊర్మిళాదేవి ముఖంలోకి తదేకంగా చూస్తూ... పోలికను...రూపాన్ని...గతాన్నీ... గుర్తుకు తెచ్చుకుంటూ, ఆకళింపు చేసుకుంటూ "నువ్వా ఊర్మిళా! బాగున్నావా!—" అడిగేడు రావ్.

ప్రొఫెసర్ని కళ్ళతో చూడగల్గినందుకు, పాప వివరాలు తెల్సుకోబోతున్నందుకూ ఆనందంతో ఊర్మిళా దేవి మనస్సు గంతులేస్తోంది.

నువ్వు వైజాగొచ్చి ఎన్నాళ్ళయిందీ?—" అడిగేడు రావ్.

"రెండేళ్ళు కావస్తోంది సార్!..."

"పోన్లే!— నిన్ను చూడగలిగాను!— నా పనీ అయిపోయింది. ఇవ్వాళో రేపో అనేట్టుంది నా పరిస్థితి..."

"మీ రేమిటి సార్ మరీ ఇంతబలహీనంగా వున్నారూ?—"

"ఇంకా బ్రతికి వున్నందుకు సంతోషించు! నాకు అయిదేళ్ళ క్రితం బొంబాయిలో కార్డియాలజీ ఆపరేషనొకటి జరిగింది? అప్పట్నుంచి యిలా అయిపోయాను అప్పట్లో సంవత్సరం

పాటు బొంబాయిలోనే వుండిపోవలసి వచ్చింది. ఆ దేవుడి దయవల్ల బ్రతికి బట్టకట్టేను. మళ్ళీ ఈ కళ్ళతో నిన్ను చూడ గల అదృష్టం రాసిపెట్టివుంది... అందుకే ఇంకా బ్రతికివున్నా నేమో?''

''సార్ నా పాప ఎక్కడుందీ? ఎలా వుందీ? ''

''నా దగ్గరుంటే... నీ గురించి చెప్పాల్సి వస్తుందనే దూరాలోచనతో- నా దగ్గరకూడా వుంచుకోకుండా కాన్వెంట్లోనే చదివిస్తూ వచ్చాను. సమ్మర్ హాలీడేస్‌లో మాత్రం వచ్చి రెండు నెలలు నా దగ్గర వుండిపోతుంది. పాప తండ్రిని నేనేనని మాత్రం దానికి తెల్సు!... తల్లి ఏదని అడిగినప్పుడు మాత్రం ఏం చెప్పాలో తెలీక...అర్థంకాక...అది పుట్టగానే తల్లి చచ్చిపోయిందనే అబద్ధం చెప్పాల్సి వచ్చింది ... ఏం చేయను చెప్పు?

''పోన్లెండి సార్...నేను బ్రతికివున్నా చచ్చిపోయినట్టే లెక్క! మంచిపని చేశారు...'' పొంగివచ్చే దుఃఖాన్ని ఆపు కుంటూ నిర్వీర్యంగా అంది.

''సార్! నా పాపను వక్కసారి కళ్ళతో చూడాలని వుంది. దయచేసి ఒక్కసారి చూపించండి సార్... అంతకంటే మిమ్మల్ని నేనేమీ కోరను! ప్లీజ్...'' ఆవేశం. ఆప్యాయత ధ్వనించాయి ఊర్మిళాదేవి మాటల్లో.

కంటికున్న జోడు తీసి కర్చీఫ్‌తో కళ్ళొత్తుకున్నాడురావ్.

"అదేమిటి సార్ ? పాపను చూపాల్సివచ్చిందుకు మీరు బాధపడుతున్నారా? అయితే వద్దులెండి సార్! తల్లిని గనుకే... మళ్ళీ ఇన్నేళ్ళతర్వాత ఒక్కసారి చూడాలన్పించింది. అంతే సార్ అంతే..." ఊర్మిళాదేవి కంఠం గద్గదికమైంది.

రావ్ ఏమీ మాట్లాడలేక పోతున్నాడు.

"పోన్లెండి సార్ ! పాపను ఎంతో శ్రద్ధతో మీరైనా పెంచి పెద్దచేశారు. అంతేచాలు! దానికి జన్మ ప్రసాదించటంతో నా అనుబంధం తీరిపోయింది. కాదా సార్ ? " దుఃఖాన్ని దిగమింగుకుంటూ జాలిగా అంది.

"యువార్ ఎ డాక్టర్! బి బోల్డ్ !!-బట్ డెస్టనీ ఈజ్ డిఫరెంట్... కన్నప్రేమ నీకు దక్కింది. పెంచిన మమకారం నాకు దక్కింది. చివరి చూపైనా దక్కలేదు నాకు- చివరకు జన్మనిచ్చిన తల్లి చేతుల్లోనే పోయింది. ఎక్కడికి చేర్చవలసిన వాళ్ళను అక్కడికి చేర్చే బాధ్యత భగవంతుడే తీసుకున్నాడు.." అంటున్న రావ్ కంఠం బలహీనమైంది.

ఆ మాటలు ఊర్మిళాదేవిని కలవర పరిచాయి.

"ఏమిటి సార్ మీరు అంటున్నది ? — " కంపించే స్వరంతో అడిగింది.

"అవును ఊర్మిళా...నీ నర్సింగ్ హోంలో...నీచేతుల్లో చచ్చిపోయిన మనోరమ నీ పాపే..." తమాయించుకుంటూ చెప్పేడు రావ్ హీనస్వరంతో.

రావ్ జవాబు విని ప్రమాన్పడ్డది ఊర్మిళ.

"నో!...నో!... అలా జరగటానికి వీల్లేదు... వీల్లేదు ..." వెర్రిగా అరిచింది గుండెలు బాదుకుంది.

"డోన్ట్ గెట్ ఎగ్జయిటెడ్!... బి బ్రేవ్!!- నీ పాపే మనోరమ! హాస్టల్లో వుంచి వైజాగ్‌లో చదివిస్తున్నాను ... తలవని తలంపుగా నువ్వూ ఇక్కడే సెటిల్ అయ్యావ్ — ఒకరి కొకరు తెల్సినా తెలియక పోయినా అయిందేదో అయి పోయింది...నాకు టెలిగ్రాం రాగానే ఇక్కడికొచ్చి నేరుగా హాస్టలుకెళ్ళి వార్డెన్‌ని కల్సుకున్నాను. ఆమెవిషయం వివరంగా చెప్పింది. కాళ్లీడ్చుకుంటూ ఇక్కడికొచ్చాను. కాకతాళీయంగా నిన్ను కల్సుకో గలిగేను... బట్ ఐయామ్ హేపీ ఫర్ వన్ థింగ్!- నువ్వెవరో తెలియకుండానే నీపాప నీదగ్గరకొచ్చింది- పెంచిన నాకు కనీసం చివరి చూపైనా దక్కలేదు — ఏం చేస్తాం ... నథింగ్ ఈజ్ ఇన్ అవర్ హేండ్స్..."

వెర్రిగా శూన్యంలోకి చూస్తోంది ఊర్మిళ.

"నా పోలికే నా పాపకూ వచ్చిందా. చివరికి తీసు కెళ్ళావా భగవాన్..." అనేసి రెండు చేతుల్లో ముఖాన్ని దాచుకుంది వెక్కి వెక్కి ఏడుస్తూ డాక్టర్ ఊర్మిళాదేవి.

(జనవరి 79 సౌమ్య మాసపత్రికలో ప్రచురితము)

★